వెల్లివిరిసిన చైతన్యం

- ముసాయిదా జాబితా విడుదల నాటికి ఓటర్లు 3.8 లక్షలు
- తుది జాబితా నాటికి 3.22 లక్షలు
- అవకాశం ఉండడంతో దరఖాస్తుల వెల్లువ
- కల్లూరు నుంచి అధికంగా వినతులు



పాణ్యం నియోజకవర్గ నమూనా

పాణ్యం: ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధిక ఓటర్లు కలిగిన నియోజకవర్గం పాణ్యం. అలాంటి నియోజకవర్గానికి ఓటర్ల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఈ ముసాయిదాల ప్రకారం పాణ్యం నియోజకర్గంలో 3,08,000 మంది ఓటర్లు ఉన్నారు. ఈ క్రమంలో ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం అధికారులు ప్రత్యేక క్యాంపైన్ నిర్వహించారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీయువకులు దరఖాస్తు చేసుకున్నారు. గతనెలలో ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాలను విడుదల చేసింది. ఈ జాబితాలో పాణ్యం నియోజకవర్గం మొత్తం ఓటర్లు 3,22,000 ఉన్నారు. ఎన్నికల కమిషన్ మరో మారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో కొత్త ఓటరు నమోదుకు భారీగా దరఖాస్తులు వస్తున్నాయని అధికారులు తెలిపారు. ఇందులో అధికంగా కల్లూరు మండలం నుంచి దరఖాస్తులు వస్తున్నట్లు చెబుతున్నారు.

3,24,356 మంది ఓటర్లు

ప్రస్తుతం పాణ్యం నియోజకవర్గంలో పురుషులు-1,58,011, స్త్రీలు-,1,66,272, ఇతరులు -73, మొత్తం 3,24,356 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే నియోజకవర్గంలో మొత్తం 340 బూత్‌లు ఉన్నాయి. మరో కొత్త బూత్ ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఎన్నికల కోడ్ వచ్చేంత వరకూ దరఖాస్తులు స్వీకరించాలని ఎన్నికల సంఘం సూచనలు ఇచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఆయా బూత్ లెవల్ ఆఫీసర్లకు పరిశీలనకు పంపుతున్నారు.

క్లుప్తంగా

సుబ్రమణేశ్వరుడి సన్నిధిలో అనంతపురం జిల్లా జడ్జి



జడ్జి దంపతులను సత్కరిస్తున్న ఆలయ అధికారులు

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆదివారం అనంతపురం జిల్లా జడ్జి శ్రీనివాస్, కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఈఓ రామక్రిష్ణ, అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. స్వామివారికి విశిష్ట పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ, సురేష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో మినరల్ బ్లాక్స్ గుర్తింపుపై వర్క్‌షాప్



జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 15, 16వ తేదీల్లో కర్ణాటక రాష్ట్రం మంగళూరులో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎల్ కాంతారావు అధ్యక్షతన సముద్రంలో మినరల్ బ్లాక్స్ ఎలా గుర్తించాలన్నదానిపై వర్క్‌షాపు నిర్వహించారు. ఏపీ ప్రతినిధిగా జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ హాజరై సముద్రంలో మినరల్ బ్లాక్స్‌ను ఎలా గుర్తించాలన్నదానిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని సముద్రతీరంలో 35 బ్లాక్స్‌ను సిద్ధం చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు వెల్లడించారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠోత్సవం



ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న దేవతా విగ్రహాలు, కలశాలు

సి.బెళగల్: మండలంలోని పల్‌దొడ్డి గ్రామంలో సోమవారం పలు దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు చేపడతామని ఉప సర్పంచ్ సుంకన్న తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ బీరలింగేశ్వర స్వామి ఆలయ ప్రారంభంతో పాటు ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. గ్రామ శివారులోని తుంగభద్ర నదీతీరంలో గ్రామ దేవత శ్రీ జమ్ములంబ దేవి విగ్రహం, నాభిశిలలు, కలశ ప్రతిష్ఠ చేపడుతున్నామని చెప్పారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఓర్వకల్లు : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ..కోలుకోలేక శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. ఓర్వకల్లు గ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి దేవాలయం వద్ద నివాసముంటున్న తంబలి దానయ్య కుమారుడు తంబలి నాగేశ్వరయ్య(50) పంట దిగుబడులు సరిగా రాకపోవడం, వ్యవసాయం కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక పోవడం, 9 నెలల క్రితమే భార్య జయంతి అనారోగ్యంతో మృతి చెందడంతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ గా, గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సకోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ.. కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. మృతుని కుమార్తె భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

సాధనతో క్రీడల్లో రాణించాలి



బెల్టు గ్రేడింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

కర్నూలు (టౌన్): విద్యార్థులు కఠోర సాధన చేసి క్రీడల్లో రాణించాలని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక యూనైటెడ్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో బెల్టు గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తైక్వాండో క్రీడ ఒలింపిక్ సంఘం గుర్తించిన క్రీడ అన్నారు. గుర్తింపు ఉన్న క్రీడల్లో సాధన చేసి ప్రతిభ చాటడం ద్వారా విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలను స్పోర్ట్స్ కోటా కింద పొందవచ్చున్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బాల గంగాధర్ రెడ్డి బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కురువలను చట్టసభలకు పంపించండి



సమావేశంలో మాట్లాడుతున్న రామక్రిష్ణ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని కురువలను చట్టసభలకు పంపించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు చర్యలు చేపట్టాలని కురువ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రామక్రిష్ణ కోరారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక శాతం కురువల జనాభా ఉన్నా, ఆయా రాజకీయ పార్టీలు కురువలను స్థానిక సంస్థలకు మాత్రమే పరిమితం చేశాయన్నారు. కురువల్లో ఎంతో మంది విద్యావంతులు ఉన్నారని, అలాగే రాజకీయాలపై ఆసక్తి, ప్రజలకు సేవ చేయాలనే గుణం కలిగి ఉన్నారన్నారు. చట్టసభలకు వెళ్లేందుకు అన్ని అర్హతలు ఉన్నా, ప్రధాన రాజకీయ పార్టీలు అవకాశం కల్పించక పోవడం వల్ల జిల్లాలో కురువలు రాజకీయంగా ఎదగలేక పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరగనున్న శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు కురువలకు ఒక పార్లమెంట్, రెండు శాసనసభ స్థానాలు కేటాయించాలని కోరారు. సమావేశంలో నాయకులు మదనపల్లి వెంకటేష్, సురేష్, రంగన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కామోత్సవ దహనం పుస్తకావిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): అశ్లీలత ప్రతిఘటన వేదిక ప్రచురించిన ఈదర గోపిచంద్ సంపాదకత్వంలో వచ్చిన 'కామోత్సవ దహనం, విషపుతేలు పుస్తకాలను స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం జేవీవీ జాతీయ నేత మహమ్మద్‌మియా అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూర, తెలుగు భాషా వికాసోద్యమకారులు జేఎస్ఆర్‌కే శర్మ హాజరై మాట్లాడుతూ 36 ఏళ్ల క్రితం నాటి అశ్లీల సినిమాలు, సీరియల్స్, తిరునాళ్ల నృత్యాలు, టీవీ ప్రోగ్రాంలపై అవిశ్రాంతంగా అనేక సంఘాలు పోరాటమే ఆధునిక సాంఘిక సంస్కృతికరంగ సంస్కరణోద్యమంలో ఒక ఉజ్వలఘట్టమని కొనియాడారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు కె. శేషాద్రి రెడ్డి, గాయకుడు అంకయ్య, ప్రొఫెసర్ శివశంకర్, రచయితలు మోహన్, హైదర్, సోమన్న, రామలక్ష్మయ్య, హరికిషన్ పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, తదితరులు

కర్నూలు సిటీ: నగరశివారులోని జూనియర్ కాలేజీలో ఇర్ఫాన్ ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు పేరుతో విద్యార్థిని వేధించడంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. తక్షణమే అధికారులు కాలేజీ గుర్తింపును రద్దు చేసి, ఇర్ఫాన్ తల్లిదండ్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ధర్నాలో విద్యార్థి తల్లిదండ్రులు, సంఘాల నాయకులు రంగప్ప, అబ్దుల్లా, సోమన్న, షాబీర్, పట్నం రాజేశ్వరి, విజయలక్ష్మి, అమర్ సాయి, ఉదయ్, అబుబక్కర్, యోగి మల్లేష్, మునిస్వామి,అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అలంరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయకులు

కర్నూలు కల్చరల్: పద్మశ్రీ ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం రాత్రి సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఘంటసాల సంగీత విభావరి నిర్వహించారు. ఘంటసాల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన పరమపదించి 50 సంవత్సరాలు అయినా ఘంటసాల పాటలకు ఇప్పటికి ఆదరణ తగ్గలేదని వక్తలు పేర్కొన్నారు. గాయకులు షేక్ ఖాదర్ బాషా, షేక్ హబీబ్, రాధిక, సంగీత బృందం శ్రీనివాసులు, రమ ణయ్య ఆలపించిన పాటలు అలరించాయి. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు గాండ్ల లక్ష్మన్న, సంగా ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

1499 ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పూర్తి

కోడుమూరు రూరల్: మండలంలో 'పేదలందరికి ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా 2,045 మంది లబ్ధిదారులకు గాను 1,499 మంది చెందిన స్థలాలకు ఆదివారం నాటికి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చినట్లు కోడుమూరు డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన ప్రతి లబ్ధిదారురాలికి ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తుందని, లబ్ధిదారులు చేయించుకోవాలని డీటీ కోరారు.

కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: కేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం కేసీ కాల్వకు ఆదివారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 0.242 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

జూలకల్‌లో ఎయిడ్స్‌పై అవగాహన

గూడూరు రూరల్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జోనల్ సూపర్‌వైజర్ రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని జూలకల్ గ్రామంలో ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీకాంతరెడ్డి ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన మంజుల కళాజాత బృందంతో వీధి నాటకం ప్రదర్శించారు.

చిన్న మల్కాపురం వాసికి డాక్టరేట్



డా.రాము యాదవ్

కర్నూలు సిటీ: డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన వి.పెద్ద నాగన్న, వెంకట లక్ష్మమ్మ దంపతుల కుమారుడు వి.రాము యాదవ్‌కి శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ తెలుగులో డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇతను రాయలసీమ ప్రాంతంలోని పురావస్తు మ్యూజియంలు ఎంపిక చేసిన హిందూ రాతి శిల్పాలపై అధ్యయనం చేశారు. ఆచార్య జి. వెంకట రామయ్య పర్యవేక్షణలో చేసిన ఈ పరిశోధనకు శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వీసీ టి.కిషన్‌రావు, బట్టు రమేష్ పీహెచ్‌డీ పట్టా అందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతకు పలువురు మిత్రులు, కుటుంబ సభ్యులు ఆదివారం అభినందనలు తెలిపారు.

ఈరోజు

రాజగోపురానికి భూమిపూజ

ఓర్వకల్లు : మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో వెలసిన శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానంలో రాజగోపుర నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద సుమారు రూ.50 లక్షలతో మూడు అంతస్తుల రాజగోపురానికి స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేత భూమిపూజ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9.30 గంటలకు జరిగే పూజా కార్యక్రమానికి ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు హాజరు కావల్సిందిగా కోరారు.

స్పందన

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీటీ పేర్కొన్నారు.

గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ ఉదయ్‌సంతోష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ అనుపమ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను తెలియజేస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

వసంతోత్సవం



చింతమానుపల్లెలో వెలసిన శ్రీ వసంతప్ప పీఠం

సి.బెళగల్: మండలంలోని చింతమాను పల్లె గ్రామంలో సోమవారం వసంతోత్సవం నిర్వహిస్తామని గ్రామ పెద్దలు, ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఏటా పంటల దిగుబడులు ఇళ్లకు చేరిన సందర్భంగా మాఘమాసం దశమిని పురస్కరించుకొని వసంతోత్సవం నిర్వహించుకోవటం ఆనవాయితీగా వస్తుందని మహానంది తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ చివర వెలసిన శ్రీ వసంతప్ప ఆలయంలోని స్వామివారి పీఠంను సుందరంగా అలంకరించి సోమవారం సాయంత్రం ఫలహార బళ్లతో చేరుకుని మొక్కులు చెల్లించుకుంటామని చెప్పారు.

కమనీయం.. కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కర్నూలు కల్చరల్: నగరశివారులోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ ఛాయా ఉష దేవి సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. రాజ శ్యామల నవరాత్రుల ముగింపు వేడుకను పురస్కరించుకొని రాజ శ్యామల హోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మహా మంగళ హారతి, మంత్ర పుష్పం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

ఉత్తమ జీవితానికి దిక్సూచి భగవద్గీత



భగవద్గీత సామూహిక పారాయణం చేస్తున్న ధార్మిక సంస్థల సభ్యులు

కర్నూలు కల్చరల్: మాఘ భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని సంకల్‌బాగ్‌లోని శ్రీగీతా ప్రచార ధామంలో ఆదివారం సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో వివిధ ధార్మిక సంస్థల సమన్వయంతో ఆ సంఘం సభ్యులు సామూహికంగా కలసి 701 శ్లోకాలను పారాయణం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు డీవీ రమణ మాట్లాడుతూ ఉత్తమ మానవ జీవితానికి భగవద్గీత మార్గదర్శనం చేస్తుందన్నారు. జీవితంలో ఎదురయ్యే అన్ని సవాళ్లకు పరిష్కారం చూపుతుందన్నారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. భగవద్గీత వ్యాప్తికి అన్ని విద్యాసంస్థలు, ధార్మిక సంస్థలు, దేవస్థానాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం సభ్యులు, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

మహోన్నతం హిందూ ధర్మం

కర్నూలు కల్చరల్: హిందూ ధర్మం మహోన్నతమైందని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన్ సేవక్ ప్రభు అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఇస్కాన్ బాధ్యులు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు భగవద్గీత పఠనం చేయాలన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన రాజశ్యామల నవరాత్రులు



ప్రత్యేక అలంకారంలో రాజశ్యామల అమ్మవారు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న రాజశ్యామల నవరాత్రుల వ్రతాలు తొమ్మిదో రోజు ఆదివారం ముగిశాయి. అమ్మవారికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేకంగా విశేష పూజలు, భజనలు నిర్వహించారు. పూర్ణాహుతితో పూజలు ముగిశాయి. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి మాట్లాడుతూ వివేకం మేధస్సు, విజ్ఞానం అనుగ్రహించే శ్రీ రాజశ్యామల అమ్మవారి నవరాత్రులు నిర్వహించడం ఎన్నో జన్మల పుణ్య ఫలం అన్నారు. పారిశ్రామిక వేత్త టీజీ భరత్, విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షుడు మద్దిలేటి, గంగపుత్ర సంఘం నాయకులు లలితా పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.









కోడుమూరు నుంచి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గూడూరులో బస్సులలో తరలి వెళ్తున్న కార్యకర్తలు, సి.బెళగల్ నుంచి రాప్తాడు సిద్ధం సభకు బయలుదేరుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఓర్వకల్లు నుంచి తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సిద్ధం సభకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నాయకులు, కార్యకర్తలతో తరలివెళ్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, సమన్వయకర్త ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్: వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించనుందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి వెళ్లారు. జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఉప సర్పంచు ప్రవీణ్ కుమార్, మండల కనీవ్వనర్ రమేష్‌నాయుడు, నాయకులు మల్లారెడ్డి, రవి కుమార్‌రెడ్డి, లింగన్న, బోరెల్లి సోమన్న, మగ్బుల్, ప్రసాద్, లింగమూర్తి, జగదీష్, గోపి, రామకృష్ణ తదితరులున్నారు

గూడూరు: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సిద్ధం సభకు మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. దాదాపు 10 బస్సుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లాం,బోయ లక్ష్మన్న ఉన్నారు.

గూడూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఆదివారం రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు తరలివెళ్లారు. చనుగొండ్ల ప్రతాప్‌రెడ్డి, జూలకల్ రఘునాథరెడ్డి, కె.నాగలాపురం మధు ఆధ్వర్యంలో వెయ్యి మందికి పైగా బయలుదేరారు.

సి.బెళగల్: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి వెళ్లారు. పలుకుదొడ్డి గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, యువకులు తరలి వెళ్లారు. అదేవిధంగా మండల కేంద్రం సి.బెళగల్లో మండల వైఎస్సార్‌సీపీ కార్యదర్శులు ముందరింటి వెంకటేష్, గోపాల్, మద్దిలేటి, హరుణ్, రామకృష్ణ, సర్పంచ్ పాండురంగన్న, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాషా ఆధ్వర్యంలో అభిమానులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు. కంబదహాల్ నుంచి కరుణాకర్‌రెడ్డి, వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ మండల అధ్యక్షుడు నబిరసూల్, గణేష్ తదితరులు వెళ్లారు.

సిద్ధం సభకు భారీగా తరలిన జనం

ఓర్వకల్లు: అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీరెడ్డి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని 22 గ్రామాల సర్పంచులు భారీ జనసమీకరణకు శ్రీకారం చుట్టారు. మండల పరిధిలో 20 బస్సులు, 30 వాహనాలలలో కలిపి సుమారు 2 వేల మందికి పైగా జనాలను తరలించారు.



పాణ్యంలో జెండా ఊపుతున్న జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి

పాణ్యం : రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు నియోజకవర్గం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. మండల కేంద్రమైన పాణ్యంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు చేరకున్న మండలంలోని ఆయా గ్రామ నాయకులు అక్కడి నుంచి రాప్తాడుకు బయలుదెరారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్లు సుమంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఎల్ల గౌడ్, ఎల్లకిట్టు, ఆటోమాబు, రాజన్న, జిల్లా వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు చాంద్‌బాషా, నడిపెన్న, చికెన్‌వలి, శివారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.